సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 12 ఏప్రిల్ 2023



బెట్టింగ్..బెట్టింగ్
ఐపీఎల్ క్రికెట్ సీజన్ వేళ బెట్టింగ్ ఊపందుకుంది. యువత లక్ష్యంగా ఆన్‌లైన్ వేదికగా కొంతమంది బుకీలుగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. 8లో




ఇంటిలో వంట చేస్తుండగా..
ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో పూరిగుడిసె దగ్ధమైంది. ఈ ఘటన పటాన్‌చెరు పట్టణం సీతరామపురంకాలనీలో చోటుచేసుకుంది. 8లో

ఒకరికి కరోనా



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 15 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 16 మందికి చేసినట్లు పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

ముగిసిన 'పది' పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షల్లో చివరి రోజైన మంగళవారం విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 21,387 మంది విద్యార్థులకు గానూ 21,351 మంది హాజరు కాగా 36 మంది గైర్హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి పటాన్‌చెరు, బీహెచ్‌ఈఎల్, రాంచంద్రాపూర్‌లలో ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 20 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. హాజరు శాతం 99.83గా నమోదైనట్లు జిల్లా విద్యాధికారులు వెల్లడించారు. పరీక్షల చివరి రోజు కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చి, తమ స్నేహితులతో సరదాగా ముచ్చటించారు. పైచదువులు ఎక్కడ చదువుతారు, మళ్లీ ఎప్పుడూ కలుద్దాం.. అంటూ ఒకరికొకరు సంతోషంగా ఇళ్లకు వెళ్లిపోయారు.

దివ్యాంగులకు ప్రత్యేక చట్టం చేయాలి



మాట్లాడుతున్న అడివయ్య

నారాయణఖేడ్: దివ్యాంగులకు పెన్షన్ పెంపు, ఉచిత విద్యుత్, ప్రయాణ సౌకర్యం, నామినేటెడ్ పదవులకు రిజర్వేషన్ల విషయంలో ప్రత్యేక చట్టం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌కు మంగళవారం వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 12.02 శాతం దివ్యాంగులు ఉన్నారని, ఇది దేశ సగటుకన్నా ఎక్కువని తెలిపారు. జనాభాకు అనుగుణంగా సంక్షేమ పథకాల్లో వాటాను 12.02 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దివ్యాంగుల డిమాండ్ల చుట్టూ రాజకీయ పార్టీలు తిరిగేలా బలమైన ఉద్యమం రావాల్సిన అవసరం ఉందన్నారు. హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కార్యదర్శి బస్వరాజ్, ఖేడ్ డివిజన్ కార్యదర్శి బుక్క ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కుంభమేళా ఏర్పాట్ల పరిశీలన



పీఠాధిపతి కాశీనాథ్‌బాబాతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాఘవాపూర్ – హుమ్నాపూర్ గ్రామ శివారులోని పంచవటి క్షేత్రంలో ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న గరుడ గంగ పూర్ణ మంజీర ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం అధికారులు పరిశీలించారు. ఉదయం క్షేత్రానికి వచ్చిన జహీరాబాద్ డీఎల్‌పీఓ రాఘవారావు క్షేత్రం పీఠాధ/ పతి కాశీనాథ్‌బాబాతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాల్లో మొదటి ప్రాధాన్యత పరిశుభ్రతకు ఇస్తున్నట్లు తెలిపారు. నది పరివాహక ప్రాంతాలు, రోడ్ల పక్కన, క్షేత్రం ఆవరణలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చూస్తామని డీఎల్‌పీఓ తెలిపారు. శానిటేషన్ నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. తగినంత సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గురుకులాల్లో అవకాశం కల్పించాలి

సంగారెడ్డి టౌన్: హిందీ పండిత్ టెట్ పాసైన వారికి గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా అవకాశం కల్పించాలని డీఎస్సీ అభ్యర్థుల ఉమ్మడి మెదక్ జిల్లా సంఘం అధ్యక్షుడు జగన్ మోహన్ కోరారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. హిందీ పండిత్ ట్రైనింగ్ శిక్షణ పొంది కోచింగ్ తీసుకున్న వారికి గురుకులాల్లో అవకాశాలు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రైవేటులో పనిచేస్తే చర్యలు

- ప్రభుత్వ వైద్యులు బయటకు మందుల చీటీ రాయొద్దు
- అవసరమైతే కొనుగోలు చేసి ఇవ్వండి
- అన్ని సబ్ సెంటర్లకు పక్కాభవనాలు
- జెడ్పీ సమావేశంలో మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, తదితరులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రభుత్వాసుపత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేసే వైద్యులు ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేయడాన్ని నిషేధించామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అలాంటి వైద్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అన్ని సబ్ సెంటర్లకు పక్క భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగుల కోసం అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేటు మెడికల్ షాపులకు చీటీ రాస్తే చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను హెచ్చరించారు. గుండె సంబంధిత వ్యాధులకు అధునాతన చికిత్సను అందించడమే లక్ష్యంగా సంగారెడ్డి, జహీరాబాద్ ఆసుపత్రుల్లో క్యాథ్‌లాక్ సౌకర్యం అందుబాటులోకి తెస్తామన్నారు.

వైద్యారోగ్యశాఖపై ప్రత్యేక చర్చ

జెడ్పీ సమావేశంలో వైద్యారోగ్యశాఖపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బందిని మంత్రి హరీశ్‌రావు అభినందించారు. సంగారెడ్డి, జహీరాబాద్‌లలో టిఫా స్కానింగ్ సౌకర్యాన్ని కల్పించారు. గర్భిణులు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు మంత్రి ఆదేశించారు. పంట నష్టపోయిన ఏ ఒక్క రైతు పేరు కూడా మిస్ కావద్దని, అనర్హులను జాబితాలో చేర్చవద్దని సూచించారు. ధాన్యం మార్కెట్‌లోకి వచ్చిన వెంటనే సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఉపాధిహామీ కూలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు పనులు చేసేలా క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలన్నారు.

సర్పంచ్‌లు తీర్మానాలివ్వడం లేదు

జెడ్పీటీసీలు, ఎంపీపీలకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులకు కొన్ని చోట్ల సర్పంచ్‌లు తీర్మానాలు ఇవ్వడంలేదని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఈసారి గొర్రెల పంపిణీ పథకంలో పలు మార్పులు చేసినట్లు కలెక్టర్ శరత్ చెప్పారు. కొనుగోలు చేసిన గొర్రెలను ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయానికి తరలించాక పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పశువైద్యాధికారులు విధులకు ఎగనామం పెడుతున్నారని పలువురు జెడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్ల పనులపై చర్చ

జిల్లాలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వట్‌పల్లి – దుద్దే, మేడికుంట తండా వంటి రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌డీఎఫ్ కింద మంజూరైన రోడ్ల నిర్మాణం పనులను కూడా వెంటనే ప్రారంభించాలని కోరారు. నల్లవాగు ఆధునీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు పేర్కొన్నారు. పలు పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలతో మంజీరా నది కలుషితమవుతోందని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమావేశం దృష్టికి తెచ్చారు.

భూ కబ్జాలు పెరుగుతున్నాయి

జిల్లాలో భూకబ్జాలు పెరుగుతున్నాయని జెడ్పీటీసీలు పేర్కొన్నారు. అన్నారంలో 261 సర్వే నంబర్‌లో విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని, రాయిని చెరువులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వ వివక్షపై తీర్మానం

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు పెట్టలేదనే కారణంగా నిలిపివేసిన నిధులను కేంద్రం విడుదల చేయాలని, రైతులకు ఇబ్బందులకు గురి చేరే విధానాలకు కేంద్రం స్వస్తి చెప్పాలని డిమాండ్ చేస్తూ జిల్లా పరిషత్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపనున్నట్లు అధికారులు ప్రకటించారు. జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు చంటిక్రాంతికరణ్, మాణిక్‌రావు, భూపాల్‌రెడ్డి, హెచ్‌డీసీ చైర్మన్ చింతప్రభాకర్, డీసీఎంఎస్, డీసీసీబీ చైర్మన్లు మల్కాపురం శివకుమార్, దేవేందర్‌రెడ్డి, కలెక్టర్ శరత్, సీఈఓ ఎల్లయ్య తదితరులున్నారు.



జెడ్పీ సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు

నెలాఖరులోగా న్యూట్రీషియన్ కిట్లు

న్యూట్రీషియన్ కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెలాఖరులోగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో పెరిగిన సాగు విస్తీర్ణానికి విద్యుత్ సరిపోవడం లేదని, విద్యుత్ అవసరాలు తీర్చేందుకు యూనిట్‌కు రూ.20, రూ.30ల చొప్పున ప్రైవేటు విద్యుత్ సంస్థల నుంచి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వడంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు తీవ్ర వివక్ష చూపుతోందని, రూ.1,300 కోట్లు ఇవ్వాలని నీతి అయోగ్ సిఫార్సు చేసిన కేంద్రం నిధులు కేటాయించలేదన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు పెట్టలేదనే కారణంగా తెలంగాణకు రావాల్సిన రూ.30 వేల కోట్లను కేంద్రం నిలిపివేసిందన్నారు.



ఎంపీ బీబీ పాటిల్‌కు సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్యుడు

సీపీఆర్‌పై శిక్షణ

సడన్ కార్డియక్ అరెస్టు అయిన అత్యవసర సమయంలో ప్రాణాలను నిలిపేందుకు చేసే సీపీఆర్ (కార్డియోపల్మోనరీ రిససిటేషన్)పై జిల్లా పరిషత్ సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలకు సీపీఆర్ చేసే విధానంపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు.

జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయం

ఆర్థిక మంత్రి హరీశ్‌రావు



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి, జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయమని, వారి ఆదర్శాలు, ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని రహదారులు, భవనముల శాఖ కార్యాలయం వద్ద పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎంపీ బీబీ పాటిల్, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, వివిధ సంఘాల నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి కంది మండలం కాశీపూర్ గ్రామంలో పూలే భవనానికి కేటాయించిన ఎకరం స్థలానికి సంబంధించిన పత్రాలను బీరయ్య యాదవ్‌కు అందించారు. కల్పకుంట రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో చింతా ప్రభాకర్ మాట్లాడుతూ చదువుతోనే వివక్ష దూరమవుతుందని పేర్కొన్నారు. పూలే సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీశ్, రెవెన్యూ డివిజనల్ అధికారి నగేశ్, డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, జెడ్పీటీసీ సునీత మనోహర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'తారా'కు న్యాక్ ఏ ప్లస్

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాష్ట్రంలోనే న్యాక్ ఏ+ గ్రేడ్ ఇచ్చారని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. ఇటీవల న్యాక్ బృందం తారా కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకులు టపాసులు పేలుస్తూ మిఠాయిలు పంచుకోవడంతో పాటు మహిళా అధ్యాపకులు నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తారా కళాశాల విద్యా ప్రమాణాలతో పాటు సహ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ వంటి విభాగాల్లో కూడా తెలంగాణ రాష్ట్రంలోనే తారా కళాశాల ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉన్నతంగా అందించడం, గ్రీన్ లైబ్రరీ, బొటానికల్ గార్డెన్స్, ఔషధ విలువలు కలిగిన ప్రత్యేక గార్డెన్‌లను ఏర్పాటు చేయడం, సమయానుకూలంగా వివిధ పద్ధతుల ద్వారా విద్యాభివృద్ధికి నిరంతరంగా కృషి చేసినందుకు 3.28 సీజీపీఏతో ఏ ప్లస్ గ్రేడ్‌తో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు.

ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే అక్రమాలు

కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కాట శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు, చెరువు భూములను కబ్జా చేస్తున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం అమీన్‌పూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సర్వే నంబర్ 1016లో వెంచర్ వేశారని, దానికి రోడ్డు కూడా లేదన్నారు. ఎకరం పదిహేను గుంటల వెంచర్‌కు దాని చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రోడ్డు వేశారని, దాని విలువ రూ.20 కోట్లకు పైగా ఉంటుందన్నారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఓ సంస్థ 12 ఎకరాల భూమిని చెరపట్టిందన్నారు. ఎకరా విలువ రూ.20 కోట్లకు పైగా ఉన్న ఈ ప్రాంతంలో 12 ఎకరాల కబ్జా స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రోద్బలంతోనే జరిగిందని ఆరోపించారు. అమీన్‌పూర్ పట్టణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, వెంచర్లను ప్రోత్సహిస్తున్న కమిషనర్‌ను జైలుకు పంపించడం ఖాయమన్నారు. బీరంగూడ మార్కెట్‌లో జరుగుతున్న నిర్మాణాలను ఆపాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. 59 జీఓ కింద దరఖాస్తు చేసిన లబ్ధిదారులకు అధికారులు తప్పుడు లెక్కలు వేసి డబ్బులు ప్రభుత్వానికి కట్టాలని వేధిస్తున్నారని ఆరోపించారు. ఆ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు కాట సుధారాణి, మున్నా, నాయకులు భాస్కర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుంటాం'



ధర్నా చేస్తున్న నాయకులు, ప్రజలు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న సురభి లాబరేటరీ పరిశ్రమ నిర్మాణం పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు నివాసాలకు ఎంతో అనుకూలంగా ఉన్న వడ్డేపల్లి పరిసర ప్రాంతాలను ఆనుకొని రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పూనుకోవడం పాలకులకు తగదన్నారు. సుమారు 13 ఎకరాల్లో పరిశ్రమ నిర్మాణం జరిగితే భవిష్యత్ తరాలు బతకలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. పరిశ్రమ నిర్మాణ పనులు నిలిపివేయాలని, లేనియెడల ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప ఉప సర్పంచ్ సురేశ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పల్లె జయశ్రీ, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌ను విజయవంతం చేయాలి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేస్తూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అధికారులను, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 అమలుపై మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ, విద్యుత్, పోలీస్, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీ నగర్ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేస్తూ స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించడం, బహిరంగంగా వ్యర్థాలు పారవేయకుండా చూడటం, చెత్త వేసే ప్రదేశాలను గుర్తించడం, మురుగునీటి కాల్వలు, నాళాల చుట్టూ ఫెన్సింగ్ వేయడం, స్వచ్ఛ వార్డులు గుర్తించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. స్వచ్ఛతలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే కాలనీలకు అవార్డులు అందించాలని కోరారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ కనెక్షన్లు సరి చూడటం, పాత స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ కాలనీల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడంతోపాటు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని సూచించారు. వైద్యశాఖ అధికారులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మూడు డివిజన్లను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్ప నగేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'డబుల్' కల.. నెరవేరుతున్న వేళ

- నేడు మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా డబుల్ బెడ్రూం ఇళ్లు ప్రారంభం
- జోగిపేట, అందోల్‌లో కలిపి మొత్తం 576 ఇళ్లు
- ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



అందోల్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం

జోగిపేట(అందోల్): చాలా కాలంగా ఎదురు చూస్తున్న జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో పేదల సొంతింటి కల నేడు నెరవేరబోతోంది. అందోలు, జోగిపేటలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను బుధవారం ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. కొద్ది నెలల క్రితమే రెవెన్యూ అధికారులు ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. గత కొంతకాలంగా ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయించారు. నాలుగైదు రోజులుగా అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తమకు సొంత ఇల్లు వస్తుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందోలులో మంత్రికి ఘనంగా స్వాగతం చెప్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందోలులో రెండు చోట్ల 324, జోగిపేటలో ఒక చోట 252 ఇళ్లు ఇలా మొత్తం మూడు చోట్ల నిర్మించిన 576 డబుల్ బెడ్రూం ఇళ్లను మంత్రి ప్రారంభించనున్నారు.

రోజంతా జోగిపేటలోనే..

మంత్రి హరీశ్‌రావు వివిధ అభివద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటకు రానున్నారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మొదటిసారిగా మంత్రి జోగిపేట పట్టణానికి పూర్తి స్థాయిలో సమయాన్ని కేటాయిస్తుండటంతో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఈ ఏర్పాట్లలో ఎమ్మెల్యే తలమునకలై ఉన్నారు. నాలుగైదు రోజులుగా అధికారులు, పార్టీ ముఖ్య నాయకులతో సమీక్షలు నిర్వహిస్తూ కార్యక్రమాలను విజయవంతం అయ్యేలా బాధ్యతలను అప్పగించారు.

విజయవంతం చేయాలి



అందోలు, జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా బుధవారం హాజరుకానున్నారు. నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులు, రూ.2 కోట్లతో నిర్మించే మోడల్ దోబీఘాట్ పనులు, ధ్యాన కేంద్రం, సీసీ రోడ్లు, మురికి కాలువ పనులకు సంబంధించిన పైలాన్ ఆవిష్కరణ, డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభోత్సవం, క్లాక్ టవర్ పునరుద్ధరణ పనులను ప్రారంభిస్తారు. అలాగే అందోలు లక్ష్మీ నరసింహా ఫంక్షన్ హాలులో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హాజరవుతారు. కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలి.

– క్రాంతికిరణ్, ఎమ్మెల్యే అందోలు

సంతోషంగా ఉంది



ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇళ్లు లేని పేదల కోసం కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వడం మంచి నిర్ణయం. అన్ని సౌకర్యాలతో నిర్మించారు. ఇల్లు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు కృతజ్ఞతలు.

– కొన్యాల లక్ష్మి, లబ్ధిదారురాలు, అందోలు

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. మంగళవారం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 30 మంది పట్టుబడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 28 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ఒకరికి రూ.3 వేలు, మరో వ్యక్తికి రూ.4 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సిద్దిపేట కమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పలు చౌరస్తాల్లో తమ సిబ్బందితో కలిసి రెండు రోజుల క్రితం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి ఐదుగురికి రూ.12,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పుష్కరాల ఏర్పాట్ల పరిశీలన



అమ్మవారి పూజలో డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

మెదక్ రూరల్: మెదక్ మండలం పేరూర్ సమీపంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న గరుడ గంగ మంజీర పుష్కరాల ఏర్పాట్లను మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరిశీలించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, పుష్కరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల తరువాత ఈ నెల 22 నుంచి 12 రోజుల పాటు పుష్కరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీ

నంగునూరు(సిద్దిపేట): ఇంటి ముందు పార్క్ చేసిన మోటారు సైకిల్‌ను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మంగళవారం రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రియాజొద్దీన్ తన యమహా బైక్‌ను రోజు మాదిరిగానే ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం చూసే సరికి బైక్ లేక పోవడంతో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయినాపూర్ గ్రామానికి చెందిన పచ్చిమడ్ల మల్లేశం(41) రోజుమాదిరిగానే వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని చెప్పి సోమవారం ఉదయం 6 గంటకు ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో మృతుడి వ్యవసాయ భూమి పక్కనగల కాయిత మోహన్‌రెడ్డి తన బావి వద్ద షెడ్‌లోని మంచంలోపడి ఉన్నట్లు మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు వెళ్లి చూడగా మల్లేశం మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య అరుణ తన భర్త కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తన మనస్తాపంతో పురుగుల మందు తాగి మరణించినట్లు అనుమానంగా ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెట్టింగ్.. బెట్టింగ్

- ఐపీఎల్ క్రికెట్ సీజన్ వేళ యువతకు గాలం
- బీరంగూడలో బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్టు
- రూ.7,40,000 స్వాధీనం.. కేసు నమోదు



బెట్టింగ్‌లో పట్టుబడిన నగదు వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న, అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి(ఫైల్)

పటాన్‌చెరుటౌన్: మెట్రోపాలిటన్ నగరాలకే పరిమితమైన ఆన్‌లైన్ బెట్టింగ్ ఇప్పుడు గల్లీగల్లీకి పాకింది. పట్టణ, గ్రామీణ యువత ఆ మోజులో పడి జేబు గుల్ల చేసుకుంటున్నారు. ఐపీఎల్ క్రికెట్ సీజన్ వేళ మళ్లీ బెట్టింగ్ ఊపందుకుంది. కొందరు యువత ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా అప్పులు చేస్తూ వాటికి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి కొంతమంది బుకీలుగా మారి బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్నారు. ఆన్‌లైన్ వేదికగా పదుల సంఖ్యలో కొత్తకొత్త యాప్‌లు పుట్టుకొస్తున్నాయి.సెల్‌ఫోన్‌లో యాప్ ఇన్‌స్టాల్ చేసుకొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై పోలీసులు గట్టి నిఘా ఉంచారు.

- పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో ఆన్‌లైన్ వేదికగా బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి.
- పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలో కొందరు యువకులు బెట్టింగ్‌లకు పాల్పడుతూ తమ వాహనాలు, సెల్‌ఫోన్లు, ల్యాబ్‌టాప్ అమ్ముకుంటున్నారు.
- అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో మార్చి మూడో తేదీన జగదీష్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. వెంటనే వారు దాడులు నిర్వహించి 7 లక్షల నలభై వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

ఐపీఎల్ బెట్టింగ్ ఇలా...

ఐపీఎల్ క్రికెట్ సీజన్ మొదలుకావడంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ బెట్టింగ్‌లు మొదలయ్యాయి. కొంత మంది యువకులు ఒక సమూహంగా మారి బెట్టింగ్‌లకు తెగబడుతున్నారు. టాస్, బంతి బంతికి, ఓవర్‌కి ఒకసారి, బ్యాట్‌మెన్స్, బౌలర్‌ను బట్టి బెట్టింగ్ పెడుతున్నారు. ఆన్‌లైన్‌లో పలు ప్రత్యేక సమాచార యాప్‌ల సాయంతో ఏ జట్టు గెలుపొందుతుంది...ఆ సమాచారాన్ని బట్టి యువత ఆ జట్టుపై, ప్లేయర్లపై బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు మే నెల చివరి వరకు కొనసాగనున్న నేపథ్యంలో అప్పటి వరకు ఐపీఎల్ బెట్టింగ్‌లు కొనసాగే అవకాశం ఉంది.

బెట్టింగ్‌లకు పాల్పడితే కేసులే



ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడినా, బుకీలుగా మారి ప్రోత్సహిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తాం. గ్రామాల్లో, పట్టణాల్లో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. యువత చెడు వ్యసనాల జోలికిపోకుండా భవిష్యత్‌పై దృష్టి సారించాలి.

– పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి

ఇంట్లో వంట చేస్తుండగా..

- గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ వద్ద మంటలు
- భయంతో బయటకు పరుగు తీసిన యువతి
- మంటలకు కాలిపోయిన గుడిసె



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: గ్యాస్ సిలిండర్ పేలి ఓ పూరిగుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట వద్ద బూరుగుపల్లికి చెందిన కోటయ్య పటాన్‌చెరు పట్టణం సీతరామపురంకాలనీలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే రేకుల షెడ్డు వేసుకుని కుటుంబంతో నివసిస్తున్నాడు. మంగళవారం కూతురు రేణుక ఇంట్లో వంట చేస్తోంది.గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ వద్ద మంటలు వ్యాపించడంతో భయంతో బయటకు పరుగులు తీసింది. అనంతరం మంటలు వ్యాపించి గుడిసె తగలబడింది. గ్యాస్ సిలిండర్ కూడా పేలడంతో మంటలు వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే సరికి గుడిసె కాలిపోయింది. ప్రమాదంలో తమ పిల్లల సర్టిఫికెట్లు, డబ్బు కాలిపోయినట్లు రేణుక కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో కోటయ్య కుటుంబ సభ్యులతో కలసి పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎంలో ఇనుప సామగ్రి తరలిస్తుండగా..

వెంబడించి పట్టుకున్న యువకులు



మాసాయిపేటలో యువకులు పట్టుకున్న డీసీఎం

చేగుంట(తూప్రాన్): అర్ధరాత్రి డీసీఎం వ్యానులో ఇనుప సామగ్రిని ఎత్తుకెళ్తుండటంతో వాహనాన్ని యువకులు వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైతులకు సంబందించిన కేజీవీల్, వ్యవసాయ పరికరాలు గత కొద్ది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. మంగళవారం తెల్లవారు జామున మాసాయిపేటలో కొన్ని పరికరాల లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యానును యువకులు వెంబడించి పట్టుకున్నారు. డీసీఎం డ్రైవర్ యూసుఫ్‌ను గ్రామ పంచాయతీలో బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీసీఎంను స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.



ఇఫ్తార్ విందులో నమాజ్ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

అభివృద్ధి అంటేనే కేసీఆర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: అభివృద్ధి అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే అభివృద్ధి అని, రాష్ట్ర ప్రజలకు గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలో ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో పోలీస్ ఆడిటోరియానికి శంకుస్థాపన చేశారు. నాల్‌సాబ్ గడ్డలో బస్తీ దావాఖానాను ప్రారంభించారు. కార్మిక భవనానికి శంకుస్థాపన చేశారు. 32 వార్డులో మంచినీటి సరఫరాకు వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇద్దరి ఆత్మహత్య



పంచనామా నిర్వహిస్తున్న ఎస్‌ఐ

కొల్చారం(నర్సాపూర్): అనారోగ్యంతో పనిచేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడం, ఆదరించవలసిన వారు పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం ఉదయం వెలుగు చూసింది. కొల్చారం ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అప్పాజీపల్లి గ్రామానికి చెందిన మృతుడు రాజబోయిన శేకులు(58) భార్య సుగుణ పదేళ్ల క్రితమే చనిపోయింది. మృతుడికి నలుగురు కొడుకులు, కూతురు ఉన్నారు. పొలం పనులుచేసేవాడు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు తెలిసిన వారి వద్ద అప్పు చేశాడు. మరోవైపు తాగుడుకు అలవాటు పడటంతో అప్పులు తీర్చే విషయమై కొడుకులతో గొడవపడేవాడు. సోమవారం రాత్రి 10 గంటలకు బయటకు వెళ్తానని ఇంటిలో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని మొగుళ్ల చెరువు కట్టపై ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి పెద్ద కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒంటరితనం భరించలేక ..

రామాయంపేట(మెదక్): ఒంటరితనం భరించలేక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామానికి చెందిన తాటి స్వామి(75) భార్య రెండేళ్ల క్రితం కరోనాతో మృతి చెందింది. అప్పటినుంచి ఒంటరితనంతో బాధపడుతున్న స్వామి గత కొంతకాలంగా మానసికంగా ఇబ్బందిపడుతున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తన పొలంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాకు న్యాయం చేయండి

బీహెచ్‌ఈఎల్ కార్మికులు



ధర్నా చేస్తున్న కార్మికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇల్లు కట్టిస్తామని డబ్బు తీసుకొని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీహెచ్‌ఈఎల్ కార్మికులు మంగళవారం రాత్రి భారతినగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఐజీ కాలనీలోని ఎలైట్ హౌసింగ్ సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడారు. 2018లో సొసైటీ అధ్యక్షుడు వివి రావు 225 మందికి సొసైటీలో సభ్యత్వం ఇచ్చి, పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలో 200 గజాల్లో రూ.38 లక్షలకు ఇల్లు నిర్మించి ఇస్తామని ఒకొక్కరి నుంచి రూ.8 లక్షలు వసూలు చేసి, బిల్డర్ శివప్రసాద్‌కు ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి ఇద్దరూ కార్మికులను వేధించడం ప్రారంభించారని ఆరోపించారు. వీరి వేధింపులు భరించలేక 45 మంది కార్మికులు సొసైటీ నుంచి వెళ్లిపోయారన్నారు. దీనిపై కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా తమకు న్యాయం జరనగలేదని వాపోయారు. ఐదేళ్ల తరువాత ఇళ్లు కట్టమని కేవలం రూ.38 లక్షలకు ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడంతో గత్యంతరం లేక 120 మంది కార్మికులు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన 60 మందికి స్థలం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పెద్దచెరువుకట్ట పరిశీలన

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని లక్డారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కేఎస్‌ఆర్ మైన్స్ వ్యవహారం వివాదాస్పదమైన సంగతి విదితమే. గ్రామానికి చెందిన ఓ సామాజిక కార్యకర్త కేఎస్‌ఆర్ మైన్స్ ఏర్పాటు వల్ల లక్డారం గ్రామ పెద్ద చెరువు కట్ట ధ్వంసమవుతుందని, ఈ విషయంపై కోర్టును ఆశ్రయించగా మంగళవారం గనులు, భూగర్భ శాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు మైన్స్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులకు తమ గోడు విన్నవించుకున్నారు. కేఎస్‌ఆర్ మైన్స్ వల్ల లక్డారం గ్రామ పెద్ద చెరువు కట్టకు ముప్పు నిజమేనని రాష్ట్ర మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. మైన్స్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్థానిక రెవెన్యూ అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారమే తమ శాఖ మైనింగ్ నిమిత్తం అనుమతులు ఇస్తుందన్నారు. ఇక్కడ చూస్తే స్థానిక రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందన్నారు. తాము పరిశీలించిన విషయాలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు, గ్రామస్తులకు నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. స్థలాన్ని పరిశీలించినవారిలో సంగారెడ్డి జిల్లా మైనింగ్ ఈడీ మధుకుమార్, ఆర్‌ఐ సైదులు, పటాన్‌చెరు సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవాలి

అడిషనల్ కలెక్టర్ రమేశ్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన, అంగవైకల్యం పొందిన వారికి ఆర్థిక సహాయం అందజేయడంలో పోలీసులు, రెవెన్యూ ఆఫీసర్లు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ రమేశ్ అన్నారు. మంగళవారం హిట్ అండ్ రన్ (మోటార్ ప్రమాదాల పథకం 2022)పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ 1 నుంచి మోటార్ ప్రమాదాల పథకం 2022 కింద జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ద్వారా నష్టపరిహారం అందించాలని నిర్ణయించిందన్నారు. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు ఈ పథకం కింద రూ.2 లక్షలు, గాయపడిన వారికి తక్షణ వైద్య చికిత్స నిమితం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి కమిటీలు ప్రతీ మూడు మాసాలకొకసారి సమావేశమై అప్పటి వరకు జరిగిన ప్రమాదాలపై పూర్తి నివేదికలను పరిశీలించి ఆమోదం అనంతరం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆ మేరకు జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ నేరుగా లబ్ధిదారుడి ఖాతాకు డబ్బులు పంపుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 17 ప్రమాద కేసులు నమోదు కాగా 15 కేసులపై ఎఫ్‌ఐఆర్, పోస్ట్‌మార్టం నివేదికతో పాటు సంబంధిత తహసీల్దార్లు కమిటీకి అందించారన్నారు. మిగిలిన రెండు కేసులపై త్వరితగతిన విచారణ జరిపి నివేదికలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ సైదులు, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, జిల్లా రవాణాధికారి శ్రీనివాస్ గౌడ్, ఆర్డీఓ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మెడికల్ విద్యార్థి మృతి



నూతక్కి నిఖిల్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో మెడికల్ విద్యార్థి మృతి చెందాడు. మంగళవారం కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శిల్ప బృందావనంకు చెందిన నూతక్కి నిఖిల్ కరీంనగర్ జిల్లా చల్మెడలోని ఆనంద్‌రావు మెడికల్ కాలేజీలో ఏడాది కాలంగా హౌస్ సర్జన్ కోర్సు చేస్తున్నాడు. ఈ క్రమంలో కారులో తెల్లవారు జామున 4.45 గంటలకు హైదరాబాద్ నుంచి కాలేజీకి వెళ్తున్నాడు వెళ్తున్నాడు. కొండపాక శివారులో రాజీవ్ రహదారి ప్రక్కన ఉన్న కల్వర్టును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి శశికర్ సంఘటనా స్థలంలో రోదించిన తీరు చూపరులను కంట తడి పెట్టించింది.

గుండెపోటుతో సీడీసీ మాజీ చైర్మన్ మృతి



సిద్దిరాంరెడ్డి (ఫైల్)

మెదక్ రూరల్: గుండెపోటుతో సీడీసీ మాజీ చైర్మన్ చిలుముల సిద్దిరాంరెడ్డి (89) మృతిచెందారు. మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన సిద్దిరాంరెడ్డి చాలాకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల ఆయన అస్వస్థకు గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సిద్దిరాంరెడ్డి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలకు తూట్లు

- అడ్డదిడ్డంగా ఆటోల పార్కింగ్
- ప్రధాన కూడళ్లే ఆటోస్టాండ్లు
- నడిరోడ్డుపైనే నిలుపుదల
- ప్రశ్నించినవారిపై దాడులు



పరిమితికి మించి ప్రయాణిస్తున్న దృశ్యం



సదాశివపేటలో నడిరోడ్డుపై నిలిపిన ఆటోలు

సదాశివపేట(సంగారెడ్డి): జిల్లాలో ఇష్టారాజ్యంగా ఆటోలను పార్కింగ్ చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ప్రధాన కూడళ్లను ఆటోస్టాండ్లుగా మార్చేస్తున్నారు. ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో రోడ్డుకి అడ్డంగా నడిరోడ్డుపై ఆటోలు నిలిపి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. గంటల తరబడి ఆటోలు నిలుపడంతో రాకపోకాలు సాగించే వాహనదారులు, ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. స్కూల్‌కెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులకు ఈ ట్రాఫిక్ అంతరాయంతో వారు పడే అవస్థలు వర్ణనీతీతం. ఆటోలు నిలుపుదలపై ఎవరైనా అడిగితే వారిపై దాడికి దిగుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.

- జిల్లాలోని ప్రధాన పట్టణాలు, మేజర్ పంచాయతీల్లోని కూడళ్లలో ఆటోల ఇష్యారాజ్యంగా ఆటోలను పార్కింగ్‌చేస్తుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.
- ప్రధాన రోడ్లు, కూడళ్లలో ఆటోస్టాండ్లు లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడే ఆటోలను నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది.
- జిల్లాలోని సదాశివపేట, సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్, బొల్లారం, అమిన్‌పూర్, తెల్లాపూర్, మున్సిపాలిటీలతో పటాన్‌చెరు, రామచంద్రాపురం పట్టణాల్లోని ప్రధాన కూడళ్ల ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్నాయి.
- ఆర్టీసి బస్టాండ్లు, ప్రధాన కూడళ్ల తదితర ప్రాంతాల్లో ఆటోలు నిలుపుతుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- అధికారికంగా ప్రతీ పట్టణంలో 200 వరకు ఆటోలు ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీలు, 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.
- జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరులో ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో అన్ని రకాల వాహనాలు 5,40,466, ఉన్నాయి. ఇందులో 8,330 వాణిజ్య వాహనాలు ఉన్నాయి.
- ప్రతి మున్సిపాలిటీ పరిధిలో 150 నుంచి 200 వరకు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో 10 నుంచి 20 వరకు ఆటోలు ఉన్నట్లు అంచనా. పట్టణాల్లో ఆటోల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగింది.
- గతంలో నిర్వహించిన సర్వేలో ఆటోలకు పోలీస్ స్టేషన్ల పరిధిలో నంబర్లు వేశారు. మెయిన్ రోడ్లపై వెళ్తున్న వంద వాహనాలను గుర్తించి పరిశీలించగా అందులో 60 వాహనాలు ఆటోలే ఉన్నట్లు తేలింది.
- ఆటోలు పెరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారింది. ప్రధాన కూడళ్లలో ఆటోస్టాండ్లు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం కావడంతో ఆటోడ్రైవర్లు తమ వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్‌చేస్తున్నారు.
- పార్కింగ్‌చేసిన వారిని ప్రశ్నిస్తే ఎదురుదాడులకు దిగుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా వారిని ఏమి అనలేని పరిస్థితి.
- గడిచిన రెండున్నరేళ్లలో జిల్లాలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ఊహించని విధంగా వాహనాల సంఖ్య పెరగడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పట్టణాలకు మండల కేంద్రాలకు వచ్చిపోయే వాహనాల సంఖ్య కూడా అనేకరెట్లు పెరిగింది.
- ప్రధాన కూడళ్లలో ఆటోస్టాండ్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు



ఆటోలను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. బస్టాండ్, సిద్దాపూర్ కూడలి పిట్టలకేరీ కూడలి, శాస్త్రిరోడ్, వికారాబాద్ రోడ్లలో ఆటోలను ఇష్టారాజ్యంగా నిలుపుతూ ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఉదయం, సాయంత్రం బస్టాండ్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు నడిరోడ్డుపై ఆటోలు నిలుపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.శశిమోహన్‌గౌడ్, డిగ్రీ విద్యార్థి, సదాశివపేట

రూల్స్ పాటించకుంటే చర్యలు



ట్రాఫిక్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఆటోడ్రైవర్లు ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. మున్సిపల్, పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆటోయూనియన్ నాయకులతో చర్చించి నా వంతు కృషి చేస్తా.

– రాజు, ట్రాఫిక్ సీఐ, సంగారెడ్డి